నయా చాంప్ న్యూజిలాండ్

తొలిసారి టీ20 ప్రపంచకప్ కైవసం • ఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఘన విజయం • అమెలియా ఆల్‌రౌండ్ ప్రదర్శన

కెర్ (43, 3/24)

విజేత: న్యూజిలాండ్ 19 కోట్లు
రన్నరప్: దక్షిణాఫ్రికా 9 కోట్లు

అక్టోబర్ 20, 2024..న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలో మరుపురాని రోజు. ఓవైపు పురుషుల జట్టు 36 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌లో భారత్‌పై టెస్టుల్లో చారిత్రక విజయం సాధిస్తే..మరోవైపు తామేం తక్కువ కాదన్నట్లు మహిళలు కొత్త చరిత్ర లిఖించారు. ఏండ్లుగా ఊరిస్తూ వస్తున్న టీ20 ప్రపంచకప్ టోర్నీని ఎట్టకేలకు ఒడిసిపట్టుకున్నారు. మెగాటోర్నీకి ముందు వరుస పరాజయాలతో కనీసం లీగ్ దశనైనా దాటుతుందా అన్న అంచనాలను తలక్రిందులు చేస్తూ పొట్టి ప్రపంచకప్‌లో నయా చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం ఫైనల్లో నిరుటి రన్నరప్ దక్షిణాఫ్రికాను మట్టికరిపిస్తూ కివీస్ తొలిసారి ప్రపంచకప్ ట్రోఫీని ముద్దాడింది. అమెలియా కెర్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో కివీస్ చారిత్రక విజయంలో కీలకమైంది.

దుబాయ్: న్యూజిలాండ్ మహిళల జట్టు కొత్త చరిత్ర లిఖించింది. కలగా మిగిలిన ఐసీసీ ట్రోఫీని ఎట్టకేలకు నెరవేర్చుకుంది. ఆదివారం జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో న్యూజిలాండ్ 32 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించింది. తొలుత న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 158/5 స్కోరు చేసింది. అమెలియా కెర్(38 బంతుల్లో 43, 4ఫోర్లు), బ్రూక్ హాలిడే(38), సుజి బేట్స్ (32) రాణించారు. మాల్బా(2/31)రెండు వికెట్లు తీయగా, కాకా, ట్రైయాన్, డికెర్క్ ఒక్కో వికెట్ పడగొట్టారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 126/9 స్కోరుకు పరిమితమైంది. అమెలియా కెర్ (3/24), రోసిమెరీ(3/25) మూడు వికెట్లతో సఫారీల పతనాన్ని శాసించారు. కెప్టెన్ లారా వోల్వార్డ్(33) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. ఛేదనలో తొలుత దూకుడుగా ఆడిన దక్షిణాఫ్రికా..లారా నిష్క్రమణ తర్వాత వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి మరోమారు తాము చోకర్స్ అని చేతల్లో చూపెట్టింది. అమెలియా కెర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' దక్కించుకుంది. 2009, 2010లో రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్ ఎట్టకేలకు 14 ఏండ్ల తర్వాత తమ చిరకాల కలను సాకారం చేసుకుంది.

కెర్ ఆల్‌రౌండ్ షో:

అంచనాలు లేకుండా బరిలోకి దిగి న్యూజిలాండ్ అద్భుతం చేసింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కివీస్..సమిష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంది. 16 పరుగులకే జార్జియా(9) వికెట్ కోల్పోయిన కివీస్..బేట్స్, కెర్ బ్యాటింగ్‌తో గాడిలో పడింది. వీరిద్దరు సఫారీ బౌలింగ్ దాడిని సమర్థంగా నిలువరిస్తూ పరుగులు కొల్లగొట్టారు. రెండో వికెట్‌కు వీరిద్దరు కలిసి 37 పరుగులు జోడించారు. కెప్టెన్ డివైన్(6) నిరాశపరిచినా..బ్రూక్‌తో కలిసి కెర్ ఇన్నింగ్స్‌ను మళ్లీ చక్కదిద్దింది. సమయోచిత ఆటతీరుతో స్కోరుబోర్డుకు కీలక పరుగులు జతచేసింది. 14 పరుగుల తేడాతో వీరద్దరు ఔటైనా కివీస్ పోరాడే స్కోరు అందుకుంది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 20 ఓవర్లలో 158/5(కెర్ 43, బ్రూక్ 38, మాల్బా 2/31, డిక్లెర్క్ 1/17), **దక్షిణాఫ్రికా:** 20 ఓవర్లలో 126/9(వోల్వార్డ్ 33, బ్రిట్స్ 17, కెర్ 3/24, రోసిమెరీ 3/25)

భారత్‌కు భంగపాటు

బెంగళూరు టెస్టులో భారీ ఓటమి • 36 ఏండ్ల తర్వాత న్యూజిలాండ్‌కు తొలి గెలుపు • రాణించిన యంగ్, రచిన్

సొంతగడ్డపై భారత్‌కు భంగపాటు ఎదురైంది. పిట్టని కోటలాంటి పిచ్‌లపై ప్రత్యర్థి చేతిలో అనూహ్య ఓటమి పలుకరించింది. వరుణుడి అంతరాయం మధ్య సాగిన బెంగళూరు టెస్టులో న్యూజిలాండ్ చేతిలో టీమ్‌ఇండియా భారీ ఓటమి చవిచూసింది. జట్టు ఎంపిక నుంచి బ్యాటింగ్ ఎంచుకోవడం వరకు అన్నింటా వైఫల్యాలు వెంటాడినా..వెరువకుండా పోరాడినా రోహిత్‌సేనకు ఫలితం దక్కలేదు. ఏదైనా అద్భుతం జరుగకపోతుందా అన్న అనుమానాలు పటాపంచలు చేస్తూ 36 ఏండ్ల తర్వాత భారత్‌లో కివీస్ తొలి టెస్టు విజయాన్ని ఖాతాలో వేసుకుని సంబురాలు చేసుకుంది. ఓపెనర్లు విఫలమైనా విల్ యంగ్, రచిన్ రవీంద్ర జట్టును గెలుపు తీరాలకు చేర్చడంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది.

బెంగళూరు: సొంత ఇలాఖాలో తమకు తిరుగేలేదనుకున్న భారత్‌కు న్యూజిలాండ్ అనుకోని షాక్ ఇచ్చింది. అసలు టీమ్‌ఇండియాకు తిరుగుందన్న తరుణంలో సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటిని కివీస్..చారిత్రక విజయంతో కదంతొక్కింది. వర్షం అంతరాయం మధ్య సాగిన బెంగళూరు టెస్టులో న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. నిర్దేశిత లక్ష్యఛేదన(107) కోసం దిగిన కివీస్..27.4 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 110 పరుగులు చేసింది. విల్ యంగ్(48 నాటౌట్), రచిన్ రవీంద్ర(39 నాటౌట్)రాణించారు. బుమ్రా (2/29) కు రెండు వికెట్లు దక్కాయి. సెంచరీతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన రచిన్ రవీంద్రకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఈ విజయంతో కివీస్ 1-0తో ముందంజ వేసింది. ఇరు జట్ల మధ్య ఈనెల 24 నుంచి పుణెలో రెండో టెస్టు మొదలుకానుంది.

కివీస్ సమిష్టిగా: స్వల్ప లక్ష్యఛేదనలో కివీస్ సమిష్టిగా పోరాడింది. మైదానం తడిగా ఉండటంతో ఆదివారం ఉదయం నిర్ణీత సమయం కంటే ఆలస్యంగా 10.15గంటలకు మ్యాచ్ మొదలైంది. బుమ్రా వేసిన తొలి ఓవర్‌లోనే కెప్టెన్ టామ్ లాథమ్(0)డకౌట్‌గా వెనుదిరిగాడు. బుమ్రా స్వింగ్‌ను సరిగ్గా అర్థం చేసుకోని లాథమ్..డీఆర్ఎస్‌కు వెళ్లినా లాభం లేకపోయింది. 35 పరుగుల తేడాతో డెవాన్ కాన్వే(17)కూడా బుమ్రాకు వికెట్ల ముందు దొరికిపోయాడు. 35 పరుగులకు రెండు వికెట్లు కోల్పోయిన కివీస్‌ను యంగ్, రచిన్ ఆదుకున్నారు. వీరిద్దరు భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ లక్ష్యాన్ని కరిగించారు. ముఖ్యంగా స్పిన్నర్లు కుల్దీప్‌యాదవ్, జడేజా ఏ మాత్రం ప్రభావం చూపించలేకపోయారు. బెంగళూరు టెస్టులో ముగ్గురు స్పిన్నర్ల వ్యూహం భారత్‌ను బాగా దెబ్బకొట్టింది. జడేజా బౌలింగ్‌లో యంగ్ గెలుపు లాంఛనాన్ని పూర్తి చేయడంతో కివీస్ జట్టు సంబురాల్లో మునిగిపోయింది. చివరిసారి 1988లో భారత్‌పై కివీస్ టెస్టు విజయం సాధించడం విశేషం.

సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 46 ఆలౌట్, **న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్:** 402, **భారత్ రెండో ఇన్నింగ్స్:** 462, **న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్:** 110/2 (యంగ్ 48 నాటౌట్, రచిన్ 39 నాటౌట్, బుమ్రా 2/29)

ఐటీఎఫ్ చాంప్ హర్షకార్తీక

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఇథియోపియా రాజధాని అడిస్ అబాబ వేదికగా జరిగిన ఐటీఎఫ్ జూనియర్ టెన్నిస్ టోర్నీలో భారత యువ ప్లేయర్ ఓరుగంటి హర్షకార్తీక విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన జూనియర్ సింగిల్స్ ఫైనల్లో హర్ష కార్తీక 6-4, 7-6(7/4)తో బ్రూనా లిటో(బ్రెజిల్)పై అద్భుత విజయం సాధించింది. టోర్నీలో ప్రత్యర్థులకు కనీసం ఒక్క సెట్ కోల్పోని కార్తీక ఫైనల్లోనూ అదే జోరు కొనసాగించింది. బలమైన ఫోర్‌హ్యాండ్, బ్యాక్‌హ్యాండ్ షాట్లతో చెలరేగుతూ వరుస సెట్లలో ప్రత్యర్థిని చిత్తుచేసింది.

ఉత్తరాఖండ్ 189/5

డెహ్రాడూన్: హైదరాబాద్, ఉత్తరాఖండ్ మధ్య రంజీ గ్రూపు-బీ మ్యాచ్ రసవత్తరంగా సాగుతున్నది. హైదరాబాద్ బౌలర్లు రోహిత్ (2/20), కార్తికేయ (1/24), మిలింద్ (1/29), అనికేత్ (1/56) ధాటికి ఉత్తరాఖండ్ రెండో ఇన్నింగ్స్‌లో 189/5 పరుగులు చేసి 222 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 244/5తో తొలి ఇన్నింగ్స్‌కు దిగిన హైదరాబాద్ 292 పరుగులకు ఆలౌటైంది. రాహుల్ (94) రాణించాడు. దీపక్ హుడా (5/51) ఐదు వికెట్లతో విజృంభించాడు.

అఖిల్ హ్యాట్రిక్ గెలుపు

కోయంబత్తూర్: ఇండియన్ రేసింగ్ లీగ్(ఐఆర్ఎల్)లో నాలుగో రౌండ్‌లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ రేసర్ అఖిల్ అలీ భాయ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఫార్ములా-4 ఇండియన్ ఓపెన్ నాలుగో రౌండ్ పోటీల్లో మూడు రేసుల్లో గెలిచి హ్యాటిక్ విజయం సాధించాడు. కొయంబత్తూర్‌లోని మోటార్‌స్పీడ్‌వే ట్రాక్‌లో జరిగిన రేసింగ్‌లో అఖిల్ దుమ్మురేపాడు.

సుందర్‌కు చోటు

కివీస్‌తో రెండు టెస్టులకు జట్టు ఎంపిక

బెంగళూరు: న్యూజిలాండ్‌తో మిగిలిన రెండు టెస్టుల కోసం ఆదివారం భారత జట్టును ప్రకటించారు. యువ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌కు బీసీసీఐ సెలెక్షన్ కమిటీ జట్టులో చోటు కల్పించింది. రంజీ ట్రోఫీలో ప్రస్తుతం ఢిల్లీతో జరుగుతున్న మ్యాచ్‌లో తమిళనాడు తరపున సుందర్ సెంచరీ(152)తో ఆకట్టుకున్నాడు. దీనికి తోడు రానున్న ఆసీస్ పర్యటనను దృష్టిలో పెట్టుకున్న సెలెక్టర్లు సుందర్‌కు జట్టులో చోటు కల్పించారు. ఈనెల 24 నుంచి భారత్, న్యూజిలాండ్ మధ్య పుణె వేదికగా రెండో టెస్టు మొదలుకానుంది.

జట్టు వివరాలు: రోహిత్(కెప్టెన్), బుమ్రా, జైస్వాల్, గిల్, కోహ్లీ, రాహుల్, సర్ఫరాజ్, పంత్, జురెల్, అశ్విన్, జడేజా, అక్షర్‌పటేల్, కుల్దీప్, సిరాజ్, ఆకాశ్‌దీప్, సుందర్.

భారత్ గెలుపు జోరు

• **సుల్తాన్ జోహర్ కప్**

జోహర్ బహ్రు(మలేషియా): ప్రతిష్ఠాత్మక సుల్తాన్ జోహర్ కప్‌లో భారత జూనియర్ హాకీ జట్టు వరుస విజయాల జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో యువ భారత్ 6-4 తేడాతో గ్రేట్‌బ్రిటన్‌పై అద్భుత విజయం సాధించింది. ఇరు జట్లు ఆది నుంచే తమదైన దూకుడు కొనసాగించారు. భారత్ తరపున దిల్‌రాజ్‌సింగ్(17ని, 50ని), శార్దనంద్‌తివారీ(20ని, 50ని) రెండేసి గోల్స్ చేయగా, కొనైన్ దాద్(7ని), మన్మీత్‌సింగ్(26ని) ఒక్కో గోల్ నమోదు చేశారు. రోరీ పెన్రోజ్(2ని, 15ని), మిచెల్ రోడెన్(46ని, 59ని) డబుల్ గోల్స్‌తో ఆకట్టుకున్నారు. మ్యాచ్ మొదలైన రెండో నిమిషానికే బ్రిటన్ గోల్ ఖాతా తెరువగా, ఆ తర్వాత పుంజుకున్న భారత్ పోటీలోకి వచ్చింది.

మెకానిక్ రాకీ హంగామా

విశ్వక్‌సేన్ నుంచి రాబోతున్న సినిమా 'మెకానిక్ రాకీ'. ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ చిత్రం నవంబర్ 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రచారంలో వేగం పెంచారు. ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ కార్యక్రమం నిర్వహించి, 'ట్రైలర్ 1.0' పేరుతో ట్రైలర్‌ని విడుదల చేశారు. వినోదాత్మకమైన అంశాలతోపాటు మాస్‌కి కావాల్సిన యాక్షన్ ఎలిమెంట్స్‌ని కూడా కలగలిపి ఈ ట్రైలర్‌ని మేకర్స్ కట్ చేశారు. యంగ్ మెకానిక్‌గా విశ్వక్‌సేన్ డాన్సులు, ఫైట్లు ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. అలాగే హీరోయిన్స్ మీనాక్షి చౌదరి, శ్రద్ధాశ్రీనాథ్‌లతో విశ్వక్‌సేన్ కెమిస్ట్రీ, నరేశ్‌తో కామెడీ సీన్స్ ట్రైలర్‌లో ఆకట్టుకుంటాయని మేకర్స్ చెబుతున్నారు. సునీల్ ఇందులో విలన్‌గా చేస్తున్నట్టు ట్రైలర్ చెబుతున్నది. విశ్వక్, సునీల్‌కి నడుమ క్లాష్ సీన్స్ కూడా మాస్‌ని ఆకట్టుకునేలా ఉన్నాయి. వైవా హర్ష, హర్షవర్ధన్, రోడీస్ రఘురామ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ కటసాని, సంగీతం: జేక్స్ బిజోయ్.

చిత్రం

అది పచ్చి అబద్ధం

ప్రభాస్, సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందనున్న భారీ పాన్ ఇండియా సినిమా 'స్పిరిట్'. ఈ ప్రెస్టేజియస్ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ క్రేజీ కపుల్ కరీనాకపూర్, సైఫ్ అలీఖాన్‌లు విలన్లుగా నటిస్తున్నారంటూ ఓ వార్త గత కొన్ని రోజులుగా మీడియా సర్కిల్‌లో ఓ రేంజ్‌లో హల్‌చల్ చేస్తున్నది. దీనిపై ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో క్లారిటీ ఇచ్చేసింది కరీనా కపూర్. 'ఇప్పటివరకూ 'స్పిరిట్' సినిమాకు సంబంధించిన ఏ ఒక్కరూ మమ్మల్ని కలవలేదు. మా మధ్య చర్చలు జరిగాయి అన్నది పచ్చి అబద్ధం.' అని తేల్చి చెప్పేసింది కరీనా. ఇంకా మాట్లాడుతూ 'సౌత్ సినిమాలో నటించాలని నాకు బలంగా ఉంది. అయితే.. నాకు తగ్గ పాత్ర రావాలి. ఆ పాత్రకు కథలో మంచి ప్రాధాన్యత ఉండాలి. అలాంటి పాత్ర వస్తే తప్పకుండా నటిస్తా. అందరూ అనుకుంటున్నట్టు 'స్పిరిట్' ఆఫర్ నా దగ్గరకు వచ్చినా.. పాత్ర నచ్చితేనే చేస్తా. మాకైతే ఎలాంటి సమాచారం లేదు' అంటూ చెప్పుకొచ్చింది కరీనా.

సింహం నక్కల మీదకొస్తే వార్ అవ్వదురా.. హంటింగ్

50ఏండ్ల నట ప్రయాణాన్ని ఇటీవలే పూర్తి చేసుకున్నారు బాలకృష్ణ. వరుస విజయాలతో హ్యాట్రిక్ హీరోగా, హ్యాట్రిక్ పొలిటీషియన్‌గా హవా చాటుతున్నారు. 60ప్లస్‌లోనూ క్షణం తీరిక లేకుండా బిజీబిజీగా గడపడం బాలయ్యకే సాధ్యం. ప్రస్తుతం ఆయన కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం టైటిల్‌ని దీపావళి రోజు ప్రకటించనున్నారు. ఇందులో బాలయ్య గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నట్టు సమాచారం. ఇందులో బాలయ్య మార్క్ డైలాగులు ఫ్యాన్స్‌కి పూనకాలు తెప్పించేలా ఉన్నాయి. ముఖ్యంగా 'సింహం నక్కలమీదకొస్తే వార్ అవ్వదురా.. హంటింగ్' అనే డైలాగ్ జనబాహుళ్యంగా బాగా వినిపిస్తున్నది. ఈ సినిమా విజయం సాధిస్తే, ఆ తర్వాత వచ్చే 'అఖండ 2' విజయం నల్లేరు మీద నడకే అని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఈ సారి డబుల్ హ్యాట్రిక్ పక్కా అనే నమ్మకంతో బాలయ్య అభిమానులున్నారు. ఇదిలావుంటే.. బాలయ్యకు త్వరలో ఓ గొప్ప గౌరవం దక్కబోతున్నదని తెలుస్తున్నది. కళాకారుడిగా, సంఘసేవకుడిగా ఆయన సుదీర్ఘ ప్రయాణానికి తగిన గౌరవం లభించనున్నట్టు విశ్వసనీయ సమాచారం.

మూడోసారి మున్నాభాయ్

బాలీవుడ్‌లో ఫ్రాంచైజీ ట్రెండ్ వేగవంతం అయ్యింది 'మున్నాభాయ్' నుంచే. సంజయ్‌దత్ కథానాయకుడిగా రూపొందిన 'మున్నాభాయ్ ఎంబీబీఎస్', 'లగేరహో మున్నాభాయ్' చిత్రాలు అఖండ విజయాలను అందుకున్నాయి. అంతేకాదు, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో కూడా 'మున్నాభాయ్' కథ రీమేక్ అయి, విజయాలను అందుకున్నది. ఇప్పటికీ ఈ ఫ్రాంచైజీకి అభిమానులు ఉన్నారంటే అతిశయోక్తికాదు. ఈ క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకొని 'మున్నాభాయ్-3'కి సన్నాహాలు చేస్తున్నారు దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీ. మూడో పార్ట్ కోసం కసరత్తు చేస్తున్నామని, స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నదని ఇటీవలే ఆయన వెల్లడించడం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం పెద్ద పెద్ద హీరోలు రాజ్‌కుమార్ హిరానీ దర్శకత్వంలో నటించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇక సంజయ్‌దత్ విషయానికొస్తే.. ఆయన దాదాపు హీరోగా ఫేడ్ అవుట్ అయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో హిరానీ 'మున్నాభాయ్ 3'ని ప్రకటించడం విశేషం. గత రెండు పార్ట్‌ల కంటే మెరుగ్గా ఈ సినిమా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు రాజ్‌కుమార్ హిరానీ తెలిపారు.

బెదిరింపుల నేపథ్యంలో పెరిగిన భద్రత

గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ వరుస బెదిరింపుల నేపథ్యంలో సల్మాన్‌ఖాన్‌కి ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసింది. కృష్ణజింకలను వేటాడిన కేసు నేపథ్యంలో సల్మాన్‌ఖాన్‌కు లారెన్స్ బిష్ణోయ్ ముఠా నుంచి పలు మార్లు బెదిరింపులు ఎదురయ్యాయి. రీసెంట్‌గా సల్మాన్ స్నేహితుడు, ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ దారుణహత్యకు గురయ్యారు. దీంతో మళ్లీ లారెన్స్ బిష్ణోయ్ పేరు తెరమీదకు వచ్చింది. దీనికి తగ్గట్టు సల్మాన్‌కు బెదిరింపులు కూడా తీవ్రమవ్వడంతో ఆయనకి భద్రత పెంచినట్టు తెలుస్తున్నది. అయితే.. సల్మాన్ సూపర్‌స్టార్ కావడంతో, ఇప్పటికే ఒప్పుకున్న కమిట్‌మెంట్స్ కారణంగా ఆయన ఇంట్లో నుంచి బయటకు రాకుండా ఉండలేని పరిస్థితి. అందులో భాగంగానే ఆయన బిగ్‌బాస్ షూట్‌లో పాల్గొన్నారు. శనివారం ప్రసారమైన ఈ ఎపిసోడ్‌లో ముందున్నంత యాక్టీవ్‌గా సల్మాన్ కనిపించలేదు. ఆయన ఫేస్‌లో ఆందోళన ప్రస్ఫుటంగా కనిపిస్తున్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీనికి తగ్గట్టే కంటెస్టెంట్స్ తప్పొప్పుల గురించి మాట్లాడుతూ సర్కాస్టిగ్గా స్పందించారు సల్మాన్. 'హౌస్‌లో ఉన్న సభ్యుల భావాలను హోస్ట్‌గా నేను పట్టించుకోకూడదు. నిజానికి నేనిక్కడకు రాకూడదనుకున్నా. రావాలని అనిపించలేదు కూడా. మీతోనే కాదు, ఎవరితో కలవకూడదనుకున్నా. కానీ నా వృత్తి అందుకు అంగీకరించదు. అందుకే రాక తప్పలేదు. వృత్తి పట్ల ఉన్న నిబద్ధత వల్లే ఇక్కడికొచ్చా.' అన్నారు సల్మాన్. అందుతున్న సమాచారం ప్రకారం 60మంది భద్రతా సిబ్బంది ప్రస్తుతం సల్మాన్‌ఖాన్‌ని పర్యవేక్షిస్తున్నారు. షూటింగ్ స్పాట్‌లో ఉన్నవాళ్లను బయటకు, బయట వాళ్లను షూటింగ్ స్పాట్‌లోకి అనుమతించడం లేదని సమాచారం.

సుహాస్ సోషియో ఫాంటసీ?

నటుడు సుహాస్ 'జనక అయితే గనుక' సినిమా ప్రస్తుతం థియేటర్లలో ఆడుతున్నది. ఈ సినిమా తర్వాత కాస్త విరామం తీసుకొని కొత్త తరహా కథతో సినిమా చేయాలని డిసైడ్ అయ్యాడట సుహాస్. ఆయన దగ్గరకు ఓ సోషియో ఫాంటసీ కథ వచ్చిందట. అది బాగా నచ్చిందట. అయితే.. దాని బడ్జెట్ సుహాస్ మార్కెట్‌కు మించి ఉండటంతో ఎలాగొలా ఆ సినిమాను పట్టాలెక్కించాలనే ప్రయత్నంలో ఉన్నాడట సుహాస్. గతంలో వచ్చిన సోషియో ఫాంటసీ కథలకు పూర్తి భిన్నంగా ఈ కథ ఉంటుందనీ, తనకు ఈ కథ సరిగ్గా సరిపోతుందని సుహాస్ భావిస్తున్నాడట. అందుకే నిర్మాణంలో భాగం కావడానికి కూడా రెడీ అవుతున్నారట. ఆ కథపై సుహాస్‌కున్న నమ్మకం అలాంటిది. త్వరలోనే దర్శకుడి పేరు రివీల్ కానుంది. మిగతా వివరాలు తెలియాల్సివుంది.

వింటేజ్ గ్యాంగ్‌స్టర్

వరుణ్‌తేజ్ 'మట్కా' చిత్రం నవంబర్ 14న విడుదల కానున్న నేపథ్యంలో ఈ సినిమాకు చెందిన ప్రచారాన్ని వేగవంతం చేశారు నిర్మాతలు డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కరుణకుమార్ తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాలోని వరుణ్‌తేజ్ వింటేజ్ బ్రాండ్ లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. బ్లాక్ అండ్ బ్లాక్ సూట్‌లో సీరియస్‌గా చూస్తున్న వరుణ్‌తేజ్‌ని ఈ లుక్‌లో చూడొచ్చు. ఇందులో ఆయన గ్యాంగ్‌స్టర్‌గా నటిస్తున్నారని సమాచారం. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహీ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో నవీన్‌చంద్ర, అజయ్‌ఘోష్, కన్నడ కిశోర్, రవీంద్రవిజయ్, పి.రవిశంకర్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ఎ.కిశోర్‌కుమార్, సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్.

డ్రగ్ కల్చర్ నిర్మూలనే కథాంశంగా

ఆట సందీప్, శగ్నశ్రీ జంటగా రూపొందుతోన్న చిత్రం 'ది షార్ట్ కట్'. రామకృష్ణ కంచి దర్శకుడు. రంగారావు తోట, రజనీకాంత్ పున్నపు నిర్మాతలు. త్వరలో సినిమా విడుదల కానుంది. హైదరాబాద్‌లో ఈ సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్టార్ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ ట్రైలర్‌ని ఆవిష్కరించి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. మెట్రో పాలిటన్ సిటీస్‌లో పెరుగుతున్న డ్రగ్ కల్చర్‌పై ఈ సినిమా తీశామని, దీనికి పరిష్కారం కూడా చూపించామని దర్శకుడు చెప్పారు. ఇంకా హీరోహీరోయిన్లు కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: ఎస్.ఎన్.మీరా, సంగీతం: ఆర్.ఆర్.ధృవన్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.